క్లుప్తంగా

బడిబాట..

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో హెచ్‌యం ధనసరి నాగమణి ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి విద్యార్థులను పాఠశాలలో జాయిన్ చేసుకున్నారు. ఫలితాల పోస్టర్లను విషయాల వారిగా ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీ

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీలో రైతులకు డీలర్లు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని టాస్‌ఫోర్స్ ఏడీఏ అఫ్జల్ బేగం సూచించారు. పట్టణంలో పలు విత్తన షాపులను ఆమె గురువారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సద్వినియోగం చేసుకోవాలి

మణుగూరుటౌన్: సింగరేణి సంస్థలో ఈపీ ఆపరేటర్ కోసం దరఖాస్తు చేసుకున్న కార్మికులకు గుర్తింపు సంఘమైన ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఏఐటీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు వై.రాంగోపాల్ అన్నారు. గురువారం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడుతూ.. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దరఖాస్తు చేసుకున్న వారికి భద్రాద్రి స్టేడియంలో లారీని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నాయకులు రామనర్సయ్య, మేకల ఈశ్వర్, గంగాధర్, ప్రవీణ్ ఉన్నారు.

కొలువుదీరిన కొర్రాజులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుర్రాల చెరువు గ్రామంలో కొర్రాజుల స్వామి జాతర ఉత్సవాల సందడి నెలకొంది. గురువారం జాతర సందర్భంగా గ్రామస్తులంతా అడవికి వెళ్లి సరువులు తీసుకొచ్చి, స్వామి వారిని కొలువుదీర్చారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకొని వివిధ రకాల పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. అలాగే భక్తులంతా కలిసి సామూహికంగా జలస్నానాలను ఆచరించారు. శుక్రవారం నిప్పుల గుండాన్ని ఏర్పాటు చేస్తారు. ఈ నిప్పుల గుండంలో భక్తులు నడవనున్నారు.

ద్విచక్రవాహనాల ఢీ.. ఇద్దరికి గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని సీతరాంపురం గ్రామంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. మణుగూరుకు చెందిన ముగ్గురు యువకులు మొండికుంట నుండి మణుగూరు వైపు బైక్ వెళ్తున్నారు. చర్లకు చెందిన యువకుడు ములుగు నుండి చర్ల వస్తున్నాడు. సీతరాంపురంలో రెండు బైక్‌లు అదుపు తప్పి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మణుగూరుకు చెందిన ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరికి..

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైన ఘటన గురువారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం..ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం కమ్మరిగూడేనికి చెందిన సోడియం వెంకన్నబాబు గుబ్బల మంగమ్మ ఆలయం నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో అశ్వారావుపేట మండలం ఆసుపాక-నందిపాడు మార్గమధ్యలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో వెంకన్నబాబు తల భాగంలో తీవ్ర గాయాలు కాగా.. గమనించి అశ్వారావుపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికు తరలించారు. వైద్యులు చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ఆస్పత్రికు తరలించారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై శ్రీను ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వాలి

ములకలపల్లి: వలస ఆదివాసీలకు ఎస్టీ కుల సర్టిఫికెట్లు మంజూరు చేయాలని పలువురు గొత్తికోయలు ప్రభుత్వాన్ని కోరారు. మండల పరిధిలోని రాచన్నగూడెంలో 22 గుత్తికోయ గ్రామాల ముఖ్యనాయకులు గురువారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి 30 యేళ్ల క్రితం ఇక్కడకు వచ్చి జీవిస్తున్న తమకు.. కుల ధృవీకరణ పత్రాలు లేకపోవడంతో తమకు ఎటువంటి రిజర్వేషన్లు వర్తించడం లేదన్నానరు. మడకం రవి, వెట్టి ముకేష్, సాయం మంగు, మడవి ఎడమ, సోయం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు పత్రం ఇవ్వండి

మణుగూరురూరల్: గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల్లో గెలిచిన సంఘానికి సింగరేణి యాజమాన్యం గుర్తింపు పత్రాన్ని వెంటనే ఇవ్వాలని సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి వి వెంకటరత్నం డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సింగరేణి ఎన్నికలు జరిగిన ఆరు నెలలు పూర్తి కావస్తున్నా నేటి వరకు యాజ మాన్యం గెలిచిన కార్మిక సంఘానికి గుర్తింపు పత్రాలను జారీ చేయలేదన్నారు. సమావేశంలో నాయకులు మాచారపు లక్ష్మారావు, నందం ఈశ్వరరావు, వై రామ్మూర్తి, లక్ష్మణరావు, విల్సన్ రాజు, ప్రభాకర్‌రావు, బుచ్చిరెడ్డి, బొల్లం రాజు, బిక్షపతి, సుమన్, శ్రీకాంత్, కట్కోజుల తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఇసుక రవాణా

- కందకాలు తవ్వించినా ఆగని దందా
- రాత్రిళ్లో పనికానిచ్చేస్తున్న ముఠా



ఇసుక ర్యాంపుల వద్ద కందకాలు తవ్విస్తున్న తహసీల్దార్ స్వర్ణలత, ఆర్‌ఐలు (ఫైల్)

అశ్వాపురం: మండల పరిధిలోని అమ్మగారిపల్లి, అమెర్ద, చింతిర్యాల గోదావరి రేవుల నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. రాత్రి సమయాల్లో గోదావరి నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. మండలంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ఇటీవల తహసీల్దార్ స్వర్ణలత, ఆర్‌ఐలు రాజేశ్వరరావు, నాగమణి గోదావరి నుంచి ఇసుక ట్రాక్టర్లు రాకుండా కందకాలు తవ్వించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. అధికారులు ఆదేశాలు పట్టించుకోని కొందరు ఇసుక ట్రాక్టర్ల యజమానులు.. ర్యాంపుల వద్ద తవ్విన కందకాలు రాత్రి సమయాల్లో పూడ్చి వేసి ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. రాత్రి 8గంటల నుంచి తెల్లవారే వరకు గోదావరి నుంచి ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. రాత్రి సమయాల్లో ఇసుక ట్రాక్టర్లు అతి వేగంగా ప్రయాణిస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక ట్రాక్టర్ల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాపై రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖల అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి సారించకపోవడం, నిఘా ఏర్పాటు చేయకపోవడం, ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడంతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటం లేదు. గోదావరి నుంచి ఇసుక ను సమీప గ్రామాల్లోకి పెద్ద ఎత్తున డంప్ చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

చర్యలు తీసుకుంటాం..

చింతిర్యాల, అమెర్ద, అమ్మగారిపల్లిలో గోదావరి నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని సమాచారంతో కందకాలు తవ్వించాం. కందకాలు పూడ్చి ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– స్వర్ణలత, తహసీల్దార్

రైతులను అడ్డుకున్న పోలీసులు



అశ్వాపురం: మంత్రులకు ఇవ్వాలనుకున్న వినతిపత్రాన్ని చూపిస్తున్న నిర్వాసితులు

ములకలపల్లి: సీతారామ ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చిన మంత్రులను కలిసేందుకు వచ్చిన స్థానిక రైతులను పోలీసులు అడ్డుకున్నారు. ప్రాజెక్ట్ వద్ద పవర్ పాయింట్ ప్రజంటేషన్ జరుగుతుండగా, సమీప గ్రామాల రైతులు, మంత్రులను కలిసే ప్రయత్నం చేశారు. సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణంలో భూములు కోల్పోయామని నిర్వాసిత రైతులు, ఎన్నోఏళ్లుగా సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు రాలేదని పోడు సాగుదారులు అక్కడకు రాగా, భద్రత కారణాలతో పోలీసులు గేటుబైటే ఆపేశారు. సమీక్ష అనంతరం లోనికి అనుమతించగా, వారు వినతిపత్రాలు అందించి, వెనుతిరిగారు.

అశ్వాపురం: తమ సమస్యలపై డిప్యూటీ సీఎం, మంత్రులకు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తుంటే పోలీసులు అడ్డుకున్నారని సీతమ్మ సాగర్ బహుళార్థసాధక ప్రాజెక్ట్ భూ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని కుమ్మరిగూడెంలో భూ నిర్వాసితులు విలేకరులతో మాట్లాడారు. అమ్మగారిపల్లి, కుమ్మరిగూడెం గ్రామాలకు చెందిన భూ నిర్వాసితులం గతంలో భారజల కర్మాగారం, మిషన్‌భగీరథ, రాజీవ్‌సాగర్, సీతారామ, సీతమ్మసాగర్ ప్రాజెక్టులలో ఐదు సార్లు భూములు కోల్పోయి భూములు లేని నిరుపేదలంగా ఉన్నామన్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా మాకు న్యాయం జరుగుతుందని డిప్యూటీ సీఎం, మంత్రులు వస్తున్నారని వారిని కలిసి తమ బాధలు చెప్పుకుందామని మా కుటుంబాలకు న్యాయం చేయాలని వేడుకుందామని వస్తే కనీసం వినతిపత్రం ఇవ్వకుండా పోలీసులు అడ్డుకున్నారన్నారు. వినతిపత్రం ఇవ్వడానికి అనుమతించలేదన్నారు. ప్రభుత్వం స్పందించి ఎకరానికి రూ.25 లక్షలు, ప్రతి నిర్వాసిత కుటుంబానికి జల విద్యుత్ కేంద్రంలో ఉద్యోగం ఇచ్చి తమ కుటుంబాలను ఆదుకోవాలని భూ నిర్వాసితులు కోరారు.

నిర్వాసితుల పక్షాన వినతి

మండల పరిధిలోని అమ్మగారిపల్లి గ్రామంలో ఎల్ అండ్‌టీ అతిథి గృహంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును గురువారం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి సీతమ్మ సాగర్ బహుళార్థసాధక ప్రాజెక్ట్ భూ నిర్వాసితుల పక్షాన వినతిపత్రం అందజేశారు. భూ నిర్వాసితుల కష్టాలు మంత్రికి వివరించి అమ్మగారిపల్లి, కుమ్మరిగూడెం గ్రామాలకు చెందిన 152 ఎకరాలకు సంబంధించి 72 మంది భూ నిర్వాసితులకు జల విద్యుత్ కేంద్రంలో కుటుంబానికి ఒక ఉద్యోగం ఇచ్చి నిర్వాసిత కుటుంబాలను ఆదుకోవాలని కేశవరెడ్డి నిర్వాసితుల పక్షాన మంత్రిని కోరారు.

అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరుటౌన్: పెండింగ్‌లో ఉన్న డ్రెయినేజీ పనులు వెంటనే పూర్తి చేయడంతో పాటు గ్రామాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ప్రజాభవన్‌లో మణుగూరు మున్సిపాలిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులతో మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో నివసించే గ్రామస్తులకు కొత్తగా నివసించే కుటుంబాలకు ఇంటి పన్ను లేనివారికి ఇంటి పన్ను ఇప్పించాలన్నారు. సీసీ రోడ్డు లేని గ్రామాలను గుర్తించి నివేదిక అందించాలని సూచించారు. త్వరలో మున్సిపాలిటీలో పాదయాత్ర నిర్వహించి ప్రతీగ్రామం అభివృద్ధి దిశగా సాగే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి గ్రామస్తుల నుంచి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, మాధవి, సత్యనారాయణ, కోటేశ్వరరావు, సిబ్బంది ప్రవీణ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

నేడు పవర్ కట్

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం ఫీడర్ నందు మెయింటెనెన్స్ పనుల కారణంగా శుక్రవారం జగ్గారం, అణుశక్తినగర్, మంచికంటినగర్, మిట్టగూడెం, కళ్యాణపురం, గోపాలపురం, పిచుకలపాడుతండా, పాయం మంగయ్యగుంపు గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆలయ వార్షికోత్సవం

ములకలపల్లి: మండపరిధిలోని నర్సాపురం శివారు కోటెమ్మతల్లి ఆలయ 18వ వార్షికోత్సవాన్ని ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించే వేడుకల్లో తొలిరోజైన గురువారం వేకువ జామునే మేళతాళాల నడుమ మంగళతోరణాలు కట్టారు. ప్రత్యేక పూజలు చేసి. పాలు, తేనె, ఫలరసాలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. వివిధ రకాల ప్రసాదాలను అమ్మవారికి నేవేద్యంగా సమర్పించారు. జలాధివాస అభిషేకంలో వందలాది మహిళలు పాల్గొన్నారు. నెత్తిన బిందెలతో ఊరేగింపుగా వచ్చి, ఆలయ ప్రదక్షిణ చేశారు. శాస్త్రోక్తంగా జలాధివాసం చేశారు.

సంత వేలం పాట ఖరారు

అశ్వారావుపేటరూరల్: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ వారపు సంత వేలం పాట గురువారం ఖరారైంది. అశ్వారావుపేట మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీఓ సీతారామరాజు ఆధ్వర్యంలో నిర్వహించగా 14 మంది పాల్గొన్నారు. వారపు సంత పాట రూ.38 వేలకు నిర్ధారించగా.. అశ్వారావుపేటకు చెందిన పమ్మిడి లక్ష్మణరావు అనే వ్యక్తి అత్యధికంగా రూ.82వేల రూపాయాలకు, అలాగే మార్కెట్ గదుల పాటను తోట నాగేశ్వరరావు అనే వ్యక్తి రూ.18600 దక్కించుకున్నారు. ఈ వేలం పాటలో పంచాయతీ ఈఓ గజవెల్లి హరికృష్ణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన ముస్కు

అశ్వాపురం: కేంద్ర బొగ్గు, గనులు శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని, హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను ఢిల్లీలో గురువారం భారతీయ జనతా పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్, ఐకార్ మెంబర్ ముస్కు శ్రీనివాస రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రులుగా బాధ్యతలు చేపట్టినందుకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు.

వీధి లైట్లను పునరుద్ధరించాలి

మణుగూరుటౌన్: కూనవరం రైల్వే గేట్ నుంచి మణుగూరు రైల్వే స్టేషన్ వరకు వీధి లైట్లు పునరుద్ధరించాలని గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం(ఇఫ్టూ) ఆధ్వర్యంలో గురువారం ఏరియా ఇంజనీర్ నర్సిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్‌డి.నాజర్‌పాషా మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్ రోడ్డులో వీధి లైట్లు వెలగకపోవడంతో రైలు ప్రయాణికులతో పాటు ఇదే రోడ్‌లో రాత్రి వేళల్లో ప్రయాణించే సింగరేణి పునరావాస న్యూ పద్మగూడెం, రాయన్న పేట గిరిజనులు ఇబ్బంది పడుతున్నారన్నారు.

హరిప్రసాద్ మృతిపై సంతాపం

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్యనగర్‌కు చెందిన మాజీవార్డు మెంబర్ హరిప్రసాద్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. కాగా గురువారం మణుగూరులో ఆయన భౌతికకాయాన్ని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, పలు పార్టీల నేతలు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ దాని అనుబంధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

మంత్రుల పర్యటనకు బందోబస్తు



మంత్రులకు భోజనాలు ఏర్పాటు చేసిన భవనం వద్ద పోలీసుల పహారా

ములకలపల్లి: ములకపలల్లి మండల పరిధిలోని వీకే రామవరంలోని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ (ఎస్‌ఆర్‌ఎల్‌ఐపీ) పరిశీలనకు మంత్రుల రాక నేపథ్యంలో పోలీస్‌శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, పోరిక బలరాం నాయక్, పలువురు ఎమ్మెల్యేల పర్యటన క్రమంలో ప్రాజెక్ట్ సమీప ప్రాంతాన్ని పోలీసుల పూర్తిగా అదుపులోకి తీసుకున్నారు. మంత్రుల పర్యటన వివరాలు అధికారికంగా రెండు రోజుల ముందే ప్రకటించడంతో, పోలిస్‌శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టుతోపాటు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఏరియా, మంత్రులు భోజనాలు ఏర్పాటు చేసిన భవనం వద్ద ఖమ్మం కమిషనర్ సునీల్‌దత్ స్వీయ పర్యవేక్షణలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పూర్తి ఏజెన్సీ మండలం కావడంతోపాటు, ప్రాజెక్ట్ ప్రదేశం అటవీప్రాంతం నేపథ్యంతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ప్రాజెక్ట్ ముఖద్వారం వద్ద నుండే పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పాల్వంచ డీఎస్పీ సతీష్‌తోపాటు, పలువురు డీఎస్పీలు, పదుల సంఖ్యలో సీఐలు, ఎస్సైలు, భారీగా కానిస్టేబుళ్లు విధుల్లో నిమగ్నమయ్యారు.

పరిమితికి మించి వైద్యం చేయొద్దు



ఆర్‌ఎంపీలతో మాట్లాడుతున్న డాక్టర్ తనుజ

చంద్రుగొండ: పరిమితికి మించి వైద్యం చేయవద్దని ఆర్‌ఎంపీలకు మండల వైద్యాధికారి డాక్టర్ కనకం తనుజ సూచించారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆర్‌ఎంపీలతో సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ఆర్‌ఎంపీలకు అవగాహన కల్పించారు. జ్వరంతో వచ్చే వారి వివరాలు రిజిస్టర్‌లో పొందుపర్చాలన్నారు. వృద్ధులు, చిన్న పిల్లలకు అధిక మోతాదులో యాంటి బయోటిక్స్ ఉపయోగించొద్దన్నారు. మూడు రోజుల తర్వాత మాత్రమే రక్త పరీక్షలు చేయాలని, జ్వరపీడితులను ప్రభుత్వ ఆస్పత్రికి పంపించాలని ఆదేశించారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి పరామర్శ

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు లంకా శివ కుటుంబాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు గురువారం పరామర్శించారు. లంకశివ మాతృమూర్తి రమాదేవి గత రెండు రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న రేగా కాంతారావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాదిత కుటుంబానికి అండగా ఉంటామని అధైర్యపడవద్దని సూచించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, నాయకులు సాగి శ్రీనివాసరాజు, జానిపాషా, కొత్తూరు సీతారామరావు,దామెర్ల శ్రీనివాసరావు, మోతుకూరి శ్రీకాంత్, అల్లాడి వెంకట్, జిలకర గంగరాజు, కొండపల్లి నరేంద్ర,జోగ బుజ్జి, జుంజురి జయసింహ, రాము తదితరులు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: ఇటీవల అనారోగ్యంతో శస్త్రచికిత్సలు చేయించుకున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్యను గురువారం ఉదయం సీపీఐ జిల్లా కార్యదర్శి శాబీర్‌పాషా, జిల్లా నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, పూర్ణచందర్‌రావు, సాయిలు పాల్గొని అయోధ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జంగం మోహన్‌రావు, దుర్గ్యాల సుధాకర్, సర్వర్ తదితరులు ఉన్నారు.

రూ.5లక్షల విలువైన టేకు కలప స్వాధీనం

చర్లరూరల్: మండలంలోని వద్దిపేటలో సుమారు రూ.5 లక్షల విలువ చేసే టేకు దిమ్మలను అటవీశాఖ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. మూడు రోజుల క్రితం చర్ల మండలం లెనిన్ కాలనీ శివారులో భారీగా టేకు లభ్యమైన విషయం విదితమే.

ఆ కేసు విచారణ చేస్తుండగా, వద్దిపేటలోనూ భారీగా టేకు నిల్వ ఉందనే సమాచారంతో తనిఖీలు చేపట్టారు. ఈమేరకు పొలాల్లో నాలుగు చోట్ల దాచిన సుమారు రూ.5 లక్షల విలువ చేసే టేకు దిమ్మలు లభ్యమయ్యాయని ఎఫ్‌ఆర్‌ఓ ఉపేంద్ర తెలిపారు.

సీజనల్ వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు

అశ్వారావుపేటరూరల్: వానాకాలం సీజన్‌లో వచ్చే వ్యాధులు, జ్వరాల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని వినాయకపురం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ కృష్ణ దీపక్ రెడ్డి కోరారు. గురువారం మండలంలోని దబ్బతోగు గిరిజన గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 32 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులకు సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. వ్యాధులు, జ్వరాలు వస్తే తక్షణమే వైద్య సేవలను పొందాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది రవి, సావిత్రి, బుల్లమ్మ పాల్గొన్నారు.

పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలి

దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గంలో ఆయిల్‌పాం పరిశోధన, బోధన, రైతులకు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు ఆయిల్‌పాం గ్రోయర్స్ సొసైటీ రైతులు వినతిపత్రం అందజేశారు. గురువారం మండలంలోని గండుగులపల్లి నివాసంలో ఎమ్మెల్యే జారేను, అశ్వారావుపేట జోన్ ఆయిల్‌పాం గ్రోయర్స్ సొసైటీ రైతులు మర్యాద పూర్వకంగా కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఆయిల్‌పాం సాగుకు అన్నిరకాలుగా అనువుగా ఉన్న అశ్వారావుపేట నియోజకవర్గంలో ఆయిల్‌పాం పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయించాలని కోరారు. దిగుమతి సుంకంను పెంచడం ద్వారా ఆయిల్‌పాంకు తగిన మద్దతు ధర పలికేలా కేంద్ర ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు పంపాలని విజ్ఞప్తి చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సాగుకు ప్రోత్సాహక సబ్సిడీని ఇప్పించాలని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య, తుంబూరు మహేశ్వరరెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, మన్నెం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను పునరుద్ధరించాలి

గుండాల: మండలంలోని కాచనపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలను తిరిగి పునరుద్దరించాలని ఆ పాఠశాల మాజీ చైర్మన్ చాట్ల సూర్యనారాయణ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత కొంత కాలంగా కొనసాగిన కాచనపల్లి గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను గత ఐదేండ్ల క్రితం స్పోర్ట్స్ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. దీంతో గత ఏడాదితో ఆశ్రమ పాఠశాల కనుమరుగైందని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత కాలంగా ఆశ్రమ పాఠశాలలో చేరే విద్యార్థులు ఇతర మండలాల్లో విద్యనభ్యసించాల్సి వస్తోంది. దగ్గరలో ఉన్న రొంపేడు ఆశ్రమంలో ఎక్కువ మంది కావడం, కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అన్ని సౌకర్యాలు ఉన్న కాచనపల్లి స్పోర్ట్స్ పాఠశాలలో తిరిగి ఆశ్రమ పాఠశాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేని యెడల ఆదివాసీ పిల్లలు డ్రాప్‌అవుట్‌గా మారే ప్రమాదముందని ఆయన పేర్కొన్నారు.

ఆక్రమణను నిలిపివేయాలి

గుండాల: అనేక ఏళ్లుగా పోడు సాగుచేసుకుంటున్న రైతుల భూములను ఫారెస్టు అధికారులు దాడులు చేస్తూ ఆక్రమించుకుంటున్నారని, ఆక్రమణను నిలుపుదల చేయాలని ఏఐటీఎఫ్ రాష్ట్ర నాయకులు ఈసం కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 11 లక్షల మంది దరఖాస్తులు చేసుకుంటే కేవలం 4 లక్షల మందికి హక్కు పత్రాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని అన్నారు. ఇటీవల వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా పోడు భూముల ఆక్రమణకు పాల్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాచనపల్లి ప్రాంతంలో ఫారెస్టు అధికారులు ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని, సాగుకు అడ్డుపడుతూ ట్రంచ్‌లు తీస్తున్నారని అన్నారు. పోడు జోలికొస్తే ఆందోళనలు ఉధృతం అవతాయని హెచ్చరించారు.

'భగీరథ'పై ఇంటింటి సర్వే



ఇంటింటి సర్వే చేస్తున్న పంచాయతీ సిబ్బంది

భద్రాచలంఅర్బన్: మిషన్ భగీరథ పథకంలో ఏర్పాటు చేసిన ఇంటింటా నీటి సరఫరా పరిస్థితిపై సర్కారు దృష్టి సారిచింది. ప్రస్తుతం భద్రాచలం పట్టణంలో ప్రతి ఇంటా కుళాయిలు ఉన్నాయా..? ఉంటే నీరు సక్రమంగా వస్తోందా..? సరఫరా చేస్తున్న నీరు కుటుంబానికి సరిపోతుందా..? పైపులైన్ల లీకేజీలు ఉన్నాయా..? కొత్త గృహాలకు నీటి పంపు కనెక్షలు ఉందా లేదా ఇలాంటి విషయాలు తెలుసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటా సమగ్ర సర్వేను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా గురువారం భద్రాచలం గ్రామ పంచాయతీ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, మిషన్ భగీరథ సిబ్బంది సంయుక్తంగా పట్టణంలోని ప్రతి ఇంటికీ వెళ్లి మిషన్‌భగీరథ నీళ్లు వస్తున్నాయా లేదా అనే విషయంపై సర్వే నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియను నిర్వహించేందుకు ఇప్పటికే సంబంధిత అధికారులు ఒక యాప్‌ను రూపొందించి, సర్వే నిర్వహించే అధికారులకు సర్వే ఎలా నిర్వహించాలి అనే దానిపై శిక్షణ కూడా అందుకున్నారు. ఈ యాప్‌లో ఇంటి యజమాని ఆధార్, ఫోన్ నంబరు, ఇంటి ఫోటో, నల్లా సంపు ఫోటోను అప్లోడ్ చేస్తున్నారు.

టోర్నీ విజేతలకు బహుమతి



చర్ల: క్రికెట్ టోర్నీలో విన్నర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న పొదెం వీరయ్య

చర్ల: మండలంలోని సీ కత్తిగూడెంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ గురువారం ముగిసింది. ఈ టోర్నీలో విన్నర్‌గా నిలిచిన మామిడిగూడెం జట్టుకు రాష్ట్ర అటవీశాఖ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్య చేతుల మీదుగా ట్రోఫీతో పాటు రూ.30 వేల నగదు బహుమతిని, జెడ్పీటీసీ సభ్యురాలు ఇర్పా శాంత చేతుల మీదుగా రన్నర్‌గా నిలిచిన జట్టుకు ట్రోఫీతో పాటు రూ.20 వేల నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. యువత అన్నీ క్రీడల పట్ల ఆసక్తి చూపాలని క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు, దేహదారుఢ్యం పెంపొందుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు నల్లమల వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ, మండల అధ్యక్షుడు ఆవుల విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మడకం పద్మజ, నాయకులు గుండేపూడి భాస్కర్ రావు, సుందరి సురేష్‌కుమార్, చీమకుర్తి సాయిచరణ తోటమల్ల వరప్రసాద్, ఇర్పా శ్రీనివాసరావు, ఆవుల పుల్లారావు, మాజీ సర్పంచ్ సరియం రాధ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: యువత నిత్యం క్రీడాపోటీలలో పాల్గొనడం వల్ల మానసిక ఉల్లాసాన్ని కలిగి ఉంటారని యువజన కాంగ్రెస్ నాయకులు తెల్లం హరికృష్ణ పేర్కొన్నారు. గురువారం అంజిపాక క్రీడామైదానంలో జరిగిన ఐదు రోజుల క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొని విజేత మంగ్వాయిబాడ్వ జట్టు, రన్నర్ జట్టు చిన్నబండిరేవు జట్టుకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫైనల్ మ్యాచ్‌లో విజేతగా నలిచిన మాంగ్వాయిబాడ్వ జట్టుకు రన్నర్ జట్టు చిన్న బండిరేవు జట్టుకు ప్రత్యేక అభినందనలు తెలియచేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.